క్లుప్తంగా

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య


సుభాష్ (ఫైల్)

ఆసిఫాబాద్: అప్పుల బాధతో చెట్టుకు ఉరేసుకుని ఒకరు ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ బాలాజీ వరప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని అంకుసాపూర్‌కు చెందిన మెంగ్రె సుభాష్(32) సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రి వరకు తిరిగిరాలేదు. భార్య కౌసల్య రాత్రి ఫోన్ చేసిన స్పందించలేదు. మంగళవారం ఉదయం జన్కాపూర్ సమీపంలోని పంజాబీ దాబా సమీపంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. ఈ విషయాన్ని స్థానికులు అందించిన సమాచారంతో సీఐ అక్కడి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బతుకమ్మ ఏర్పాట్లు పరిశీలన


పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజేందర్

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని గాంధీచౌక్‌లో ఏర్పాటు చేయనున్న బతుకమ్మ పండుగ ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ రాజేందర్ మంగళవారం పరిశీలించారు. గాంధీ చౌక్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకున్నారు. ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి బ్లీచింగ్ వేయాలని సిబ్బందికి సూచించారు. మహిళలకు ఇబ్బంది కలుగకుండా లైటింగ్ ఏర్పాటు చేయాలని, భద్రత చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యాపారులు, స్థానికులు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఫుట్‌బాల్ జోనల్ స్థాయికి విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దహెగాం: మండలంలోని చినరాస్పెల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఫుట్‌బాల్ జోనల్ స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం సునీత మంగళవారం తెలిపారు. కాగజ్‌నగర్ మండలంలోని ఈస్‌గాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన అండర్-14, అండర్-17 విభాగంలో ప్రతిభ కనబర్చారు. అండర్-14 విభాగంలో సాపిలె అంజన్న, ఎల్ములే వినయ్, ఎల్కరి కార్తీక్, అండర్-17లో విభాగంలో తుమ్మిడె ఉదయ్‌కిరణ్, కామెర అభిషేక్ ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

రెండోరోజు కొనసాగిన సమ్మె

కాగజ్‌నగర్‌టౌన్: మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట పారిశుద్ధ్య కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె మంగళవారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు నాలుగు నెలలుగా వేతనాలు అందక పోవడంతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. రావాల్సిన పీఎఫ్ రూ.1.56 కోట్లు,, ఈఎస్ఐ రూ.12.50 లక్షలు చెల్లించాలని నిరవధిక సమ్మె చేస్తున్నామన్నారు. అధికారులు స్పందించకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు. బీఆర్ఎస్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అంబాల ఓదెలు వీరికి మద్దతు పలికారు. ఈ సమ్మెలో పారిశుద్ధ్య కార్మిక సంఘం నాయకులు శంకర్, అంజయ్య, సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని కిమ్స్ ఆసుపత్రిలో కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీసెస్ సొసైటీ వ్యవస్థాపకుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్-అనిత ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పాల్గొన్న 32 మందిలో 16 మందికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. వారిని బెల్లంపల్లిలోని లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి సహకారంతో శస్త్రచికిత్స చేస్తామని తెలిపారు. అప్తాలమిస్ట్ శ్రీనాథ్, ఐ క్యాంప్ ఇన్‌చార్జి గోపి తదితరులు ఉన్నారు.

- ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పట్టణంలోని ప్రజాలైఫ్‌కేర్ ఆసుపత్రిలో నిర్వహించారు. శిబిరంలో 34 మందిని పరీక్షించగా అందులో 11 మందికి ఆపరేషన్ అవసరమని వారికి విడతల వారీగా ఆపరేషన్ చేస్తామని వైద్యులు తెలిపారు.

యువతకు కౌన్సెలింగ్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని బాలికల హాస్టల్ వద్ద అనుమానాస్పదంగా ఇద్దరు యువకులు గోడ ఎక్కే ప్రయత్నం చేస్తుండగా మంగళవారం షీటీం సభ్యులు బిక్కాలాల్, సభ్యులు అదుపులో తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. షీ టీం సభ్యులు స్వప్న, రజని, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

కలుపు కష్టాలు

- వరి పంటలో పెరిగిన కలుపు మొక్కలు
- కూలీల కొరతతో ఇబ్బందులు
- దిగుబడిపై ప్రభావం
- ఆందోళనలో రైతులు


తలోడి శివారులో వరి పంటలో కలుపు తీస్తున్న కూలీలు

కౌటాల: రైతులకు ప్రతిఏటా మాదిరిగా ఈ ఏడాది ఖరీఫ్ కాలం మొదటి నుంచే కష్టాలు ఎదురవుతున్నాయి. వరి నారుమడిలో విత్తనాలు చల్లినప్పటి నుంచి నష్టాలు ఒకదాని వెంట మరొకటి వెంటాడుతూనే ఉన్నాయి. నాట్లు వేసిన అనంతరం జిల్లాలో విస్తారమైన వర్షాలు కురవడంతో రైతులు ప్రస్తుతం పొలాల్లో వచ్చిన కలుపు తొలగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓ వైపు కూలీలు, యూరియా కొరత, మరోవైపు పెరిగిన కూలితో పెట్టుబడి ఖర్చులు ఎక్కువ అవుతున్నాయి. కలుపు పెరగడంతో దిగుబడిపై ప్రభావం పడుతుందని ఆందోళన చెందుతున్నారు. ఎకరం కలుపు తీయాలంటే సుమారు 20 నుంచి 25 మంది వరకు కూలీలు అవసరం ఉంటుందని పేర్కొంటున్నారు.

భారీ వర్షాలకు పనిచేయక..

ఈ ఖరీఫ్‌లో రైతులు వరి నాట్లు అనంతరం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిశాయి. పంట పొలాల్లో ఎలాంటి పనులు చేయడానికి అవకాశం లేకుండా పోయింది. భారీ వర్షాలు కురవడంతో గడ్డిజాతి మొక్కలతోపాటు తుంగ, గెరికి పెరిగి వరి పంటకు వేసిన ఎరువుల బలాన్ని కలుపు మొక్కలే గ్రహిస్తున్నాయి. దీంతో పంట ఏపుగా పెరగడం లేదు. వాటిని తొలగించేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. భారీ వర్షాల కారణంగా ఎలాంటి పనులు చేయలేకపోవడంతో ప్రస్తుతం కలుపు మొక్కలే ఎక్కువగా ఉండటంతో ఎకరాకు 15 నుంచి 25 మంది వరకు కూలీలు అవసరం అవుతున్నారు. దీనికి తోడు గతంలో రోజు కూలీలకు ఒక్కొక్కరికి రూ. 200 ఉండేది. ప్రస్తుతం రూ. 300 పెరిగింది. పెరిగిన ఖర్చులతో ఎకరాకు కనీసం 20 మంది కూలీలకు గానూ రూ.6 వేల ఖర్చవుతుంది. అసలు నీటి సౌకర్యం లేని పొలాల్లో ఎకరాకు రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు ఖర్చవుతుంది.

జిల్లావ్యాప్తంగా 55 వేల ఎకరాల్లో వరి సాగు

జిల్లా వ్యాప్తంగా రైతులు ఈసారి మొత్తం 55 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. విస్తారంగా వర్షాలు కురవడంతో పంట ఆశాజనకంగా ఉంది. మంచి దిగుబడి వస్తుందని ఆశతో ఉన్నారు. కాని కలుపు పెరగడంతో ఆందోళన చెందుతున్నారు. పంటకు ఎండు తేమ, అగ్గి తెగులు సోకే అవకాశం ఉండడంతో ఎరువులు వేసుకోవాలని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం పొలాల్లో కలుపుపై సమరం ప్రకటించినట్లు పొలాల్లో పదుల సంఖ్యలో కూలీలు కలుపు తీస్తున్నారు. మరో వైపు యూరియా కొరత కారణంగా వరికి ఎరువులు సకాలంలో వేయకపోవడంతో కొన్నిచోట్ల పంట ఆశించిన స్థాయిలో ఎదుగుదల కనిపించడం లేదు. ప్రభుత్వం స్పందించి రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

కూలీలు దొరకడం లేదు



నేను మూడెకరాల్లో వరి సాగు చేస్తున్నా. ఈ ఏడాది నాట్లు వేసిన అనంతరం వర్షాలు కురవడంతో ఎలాంటి పని చేయలేదు. ప్రస్తుతం పంటలో పెరిగిన కలుపు తీతకు కూలీలు దొరకడం లేదు. మరోవైపు యూరియా కొరత కారణంగా పంటకు సకాలంలో ఎరువులు వేయకపోవడంతో దిగుబడిపై ఆందోళనగా ఉంది. కూలీ ఖర్చులు పెరగడంతో కలుపుతీత భారంగా మారింది. అధికారులు యూరియా కొరత లేకుండా చూడాలి.

– రామయ్య, యాపలగూడ

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీజీఎం ఎస్‌కే మదీనా బాషా

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని డీజీఎం సివిల్ ఎస్‌కే మదీనా బాషా అన్నారు. డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ 92వ వార్షిక క్రీడాపోటీల్లో భాగంగా మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి పాఠశాల మైదానంలో బాల్‌బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియా క్రీడాకారులు నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ పోటీల్లో రాణించాలన్నారు. క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూనే కోలిండియా స్థాయిలో పతకాలు సాధించాలని సూచించారు. అనంతరం సీనియర్ క్రీడాకారులను సన్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నంది అన్వేష్, జనరల్ కెప్టెన్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

19న మళ్లీ రైళ్లు రద్దు

సిర్పూర్(టి): కాజీపేట- బల్లార్షా మార్గంలో మరమ్మతుల కారణంగా ఈనెల 19న పలు ప్యాసింజరు రైళ్లు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సిర్పూర్(టి)- కాజీపేట సింగరేణి ప్యాసింజరు, కాజీపేట- బల్లార్షా రామగిరి ప్యాసింజరు, కరీంనగర్- సిర్పూర్(టి) పుష్పుల్ రైళ్లు ఒక్క రోజు రద్దు చేశారు.

ప్రయాణికులకు అందుబాటులో ఉంటాం

కాగజ్‌నగర్‌టౌన్: రైల్వే యాత్రి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రయాణికులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని అధ్యక్షుడు ప్రయాగ్ తివారి అన్నారు. పట్టణంలోని రాజస్థాన్ భవన్‌లో మంగళవారం మాట్లాడారు. కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో కొత్తగా నాలుగు రైళ్ల హాల్టింగ్‌తోపాటు ఈనెల 18న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్ కానుందన్నారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్ కార్యక్రమానికి ఎంపీ నగేష్, ఎమ్మెల్యే హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ దండె విఠల్ హాజరుకానున్నారని తెలిపారు. పవన్ బల్దేవ్, అరుణ్ లోయ, అనిల్ పాల్గొన్నారు.

సందర్శించి.. పరిశీలించి


ఆగుర్‌వాడలో రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని మోడి కేజీబీవీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆగుర్‌వాడ ప్రాథమిక పాఠశాలలను మంగళవారం అదనపు కలెక్టర్, డీఈవో దీపక్ తివారి సందర్శించారు. రికార్డులు పరిశీలించి.. ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచనలు చేశారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పుస్తకాలు చదివించి అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. అంతకు ముందు కొఠారిలో ఇందిరమ్మ గృహాలను పరిశీలించారు. ఆయన వెంట ఎస్‌వో శ్రీనివాస్, ఎంఈవో ఆడే ప్రకాశ్, ఎంపీడీవో అంజద్‌పాషా ఉన్నారు.

కులగణన డేటా ఎంట్రీ డబ్బులు చెల్లించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: కులగణనలో కుటుంబ వివరాలను ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ చేసిన ఆపరేటర్లకు డబ్బులు చెల్లించాలని కోరుతూ ఎంపీడీవో కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనలో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు సేకరించిన కుటుంబ సభ్యుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒక్కో కుటుంబానికి రూ. 30గా చెప్పి సుమారు 823 మందితో వివరాలు నమోదు చేయించారని తెలిపారు. ఈ ప్రక్రియ ముగిసి సంవత్సరం గడుస్తున్నా నేటికి డబ్బులు ఇవ్వకపోవడంతో పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి త్వరగా డబ్బులు చెల్లించేలా చూడాలని కోరారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు నెల్లి రవి, మాట్ల అనీల్, గడ్డల ప్రణయ్, కోలె బిక్కాజీ, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు వర్క్‌షాప్


వర్క్‌షాప్‌లో ప్రయోగం చేస్తున్న విద్యార్థులు

కాగజ్‌నగర్‌టౌన్: మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని జాతీయ ఇంజనీరింగ్ దినోత్సవం సందర్భంగా మంగళవారం కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు భౌతిక శాస్త్ర ఆధ్వర్యంలో రెండు రోజుల ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ ఇంజనీరింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన మిట్టపల్లి నాగఅశ్విని హాజరై విద్యార్థులకు భవనం నిర్మాణంలో ఉపయోగించే వివిధ పదార్థాలు, నాణ్యతను పరీక్షించే విధానాన్ని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించి వివిధ ప్రయోగశాలల్లో ఉపయోగిస్తున్న పరికరాలు, ఉపయోగించే విధానం గురించి అధ్యాపకులు వివరించారు. ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ ఇలాంటి వర్క్‌షాప్‌ద్వారా విద్యార్థులు ప్రత్యక్ష జ్ఞానాన్ని పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. గణిత అధ్యాపకుడు రాజేశ్వర్, కంప్యూటర్ అధ్యాపకురాలు శ్రవంతి, భౌతిక శాస్త్ర అధ్యాపకుడు బిరోజ్ మేరీ పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారమే లక్ష్యం

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు


లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కౌటాల: దేశంలోని పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంగళవారం మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య, తహసీల్దార్ ప్రమోద్‌కుమార్, ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఏవో ప్రేమలత, ఏఈ సజీఉద్దీన్, కార్యదర్శి సాయికృష్ణ పాల్గొన్నారు.

'ప్రాణహిత' కట్టాల్సిన బాధ్యత కాంగ్రెస్‌దే..

2008లో దివంగత సీఎం రాజశేఖరరెడ్డి ప్రారంభించిన తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయాల్సిన బాధ్యత ఉందని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మంగళవారం కౌటాలలో ఆయన మాట్లాడారు. ప్రాణహిత ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించకపోతే తను ఎమ్మెల్యే ఎన్నికల్లో పోటీ చేయనని ఎమ్మెల్సీ దండె విఠల్ ప్రకటించడం విడ్డురంగా ఉందన్నారు. గతంలోనే ఈ ప్రాజెక్టును ప్రారంభించారని, ప్రస్తుతం పనులు పూర్తి చేయాలని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ మాటాలకు నవ్వాలో, ఆయన మీద జాలిపడాలో తెలియడం లేదని ఎద్దేవా చేశారు. రైతులకు యూరియా కొరత లేకుండా చూస్తామని తెలిపారు. అనంతరం యాపలగూడలో పలువురు బీజేపీలో చేరారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, ఉపాధ్యక్షుడు బండి రాజేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు కుంచాల విజయ్, నాయకులు సత్యనారాయణ, దుర్గం మోతీరాం, వానుపటేల్, తిరుపతి, మధుకర్, భూమయ్య, రావుజీ, శ్యామల పాల్గొన్నారు.

లాభాల నుంచి 35 శాతం వాటా చెల్లించాలి

- టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు


మాట్లాడుతున్న మల్రాజు శ్రీనివాస్‌రావు

రెబ్బెన: గత ఆర్థిక సంవత్సరంలో సింగరేణికి వచ్చిన వాస్తవ లాభాలు ప్రకటించి కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూర ఓసీపీని మంగళవారం సందర్శించి కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరాకు కేవలం 15 రోజుల సమయం మాత్రమే ఉందని ఇప్పటివరకు లాభాలు ప్రకటించకపోవడంతోపాటు కార్మికులకు చెల్లించాల్సిన వాటా ప్రకటించలేదన్నారు. సింగరేణి కార్మికులకు వెంటనే లాభాల వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాల్లో భాగంగా వెంటనే మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. లేకపోతే టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్, అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి నాయకత్వంలో కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజాప్రతినిధుల సహకారంతో హైదరాబాద్‌లో పోరాటానికి వెనుకాడబోమన్నారు. పిట్ కార్యదర్శి బొంగు వెంకటేశ్, ఏరియా కార్యదర్శి మారిన వెంకటేశ్, సెంట్రల్ కమిటీ నాయకులు జూనియర్ తిరుపతి, దస్తగిరి రమేశ్, నాయకులు రాజమౌళి, రాజేశం,భి క్షపతి, అజీమ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్ఎస్ఆర్ రేట్లు పెంచేవరకు నిరసన'


ఎస్ఈ శేషారావుకు వినతిపత్రం అందిస్తున్న కాంట్రాక్ట్ అసోసియేషన్ సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: విద్యుత్ శాఖలో కొనసాగుతున్న వివిధ పనులకు సంబంధించిన ఎస్ఎస్ఆర్ రేట్లను పెంచేవరకు నిరసన కొనసాగిస్తామని తెలంగాణ ఎన్పీడీసీఎల్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నుంచి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నిర్ణయం మేరకు పనులు నిలిపివేస్తున్నట్లు ఎస్ఈ శేషారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2021లో నిర్ణయించిన రేట్లు ఇస్తున్నారని తెలిపారు. అప్పటి కార్మిక ధరలకు ఇప్పటికి తేడా ఉందని, ప్రస్తుత ధరలకు అనుగుణంగా రేట్లను సవరించాలని కోరారు. జనరల్ సెక్రటరీ అంజయ్య, సభ్యులు జహంగీర్‌ఖాన్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఐఎన్‌టీయూసీని విమర్శించే నైతిక హక్కు లేదు'

రెబ్బెన: లిక్కర్ స్కాంలో తీహార్ జైలులో ఉండివచ్చిన కవిత ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, కాంగ్రెస్ నాయకులపై అవినీతి ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఎన్‌టీయూసీ, కాంగ్రెస్ నాయకులపై ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. లిక్కర్ స్కాంలో జైలులో ఉన్న కవితకు ఐఎన్‌టీయూసీ, కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. సింగరేణి కార్మికుల కోసం దసరా లాభాల వాటాను త్వరలో ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. మాధవకృష్ణ, శ్రీనివాస్, స్వామి, అంబేడ్కర్, ప్రభాకర్, కుమారస్వామి, రామ్మోహన్, కుమారస్వామి, రమేశ్, భీమేశ్ పాల్గొన్నారు.

సీఐ, ఎస్సైలకు సన్మానం

రెబ్బెన: రెబ్బెన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సంజయ్‌తోపాటు మూడు రోజుల క్రితం బదిలీపై వచ్చిన ఎస్సై వెంకటకృష్ణలను మంగళవారం బీఆర్ఎస్ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సైలను సన్మానించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ రంగు మహేశ్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సంఘం శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుందారపు శంకరమ్మ పాల్గొన్నారు.

సిర్పూర్(టి): ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై సురేష్‌కుమార్‌ను బీజేపీ నాయకులు మంగళవారం సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షురాలు చన్నపురి లావణ్య, నాయకులు వడ్డేటి నానయ్య, పైడి విలాస్, నులిగొండ మహేశ్, నేరెళ్ల అశోక్, దుర్గం ప్రశాంత్, కిర్మరే శ్యాంరావ్, బాలాజీ, బండ రవి, జావిద్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థులతో వంట పనులు



ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న డైలీ వేజ్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని సమ్మె చేస్తున్నారు. జైనూర్ మండలం పట్నాపూర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంగళవారం విద్యార్థులే వంట పనులు చేయాల్సిన పరిస్థితి. వారికి పీడీ రాజేంద్రప్రసాద్ తోడుగా సాయమందించారు.

రెండో రోజు కబడ్డీ పోటీలు

కాగజ్‌నగర్‌టౌన్: మాజీ ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తంరావు స్మారక కబడ్డీ పోటీలు పట్టణంలోని ఎస్పీఎం క్రీడా మైదానంలో రెండో రోజు కొనసాగుతున్నాయి. మంగళవారం కబడ్డీ పోటీల్లో సీ బాపు కాలనీ, నజ్రుల్‌నగర్ టీంలు తలపడ్డాయి. నియోజకవర్గంలోని సిర్పూర్(టి), కౌటాల, బెజ్జూర్, దహెగాం, కౌటాల, పెంచికల్‌పేట్, కాగజ్‌నగర్ మండలాల నుంచి 34 టీంలు వచ్చాయని నిర్వాహకులు తెలిపారు. రెండోరోజు పోటాపోటీగా కబడ్డీ పోటీలు జరిగాయి.

ఇందిరమ్మ ఇళ్ల పనులు త్వరగా పూర్తిచేయాలి

సిర్పూర్(టి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. డోర్‌పల్లి పంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలి

పెంచికల్‌పేట్: మండలంలోని దరోగపల్లి కొలావార్ కాలనీలో విద్యుత్ సమస్య పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు తహసీల్దార్ తిరుపతికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీకి విద్యుత్ తీగలను వేయడానికి విద్యుత్ అధికారులు రాగా, కొందరు అడ్డుకుంటున్నారని అన్నారు. దీంతో అంధకారంలో కాలం గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

ఫొటో్ట్రేడ్స్ ఎక్స్ పో పోస్టర్ ఆవిష్కరణ

పెంచికల్‌పేట్: హైదరాబాద్‌లో ఈనెల 19, 20, 21 నిర్వహించే ఫొటో ట్రేడ్ ఎక్స్ పో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫొటో, వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ సమీర్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఫొటో ఎక్స్ పో పోస్టర్లను ఆవిష్కరించారు. ఫొటోగ్రాఫర్స్ పాల్గొనాలని కోరారు. సంఘం నాయకులు సతీశ్, వినయ్, రాజు, హమీద్, సంతోష్, పెంటయ్య, కిరణ్, హరికృష్ణ, సతీశ్, వినోద్, అంజన్న, రాజు, తిరుపతి, సందీప్, నరేశ్ పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంలో ఫొటో ట్రేడ్ ఎక్స్ పో పోస్టర్లను ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంఘం నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. షేక్ సమీర్, సతీష్, నాగేశ్, వినయ్, రాజు, హామిద్, జీవన్, నాందేవ్, జితేందర్, నాగరాజ్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలో 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. డీఆర్‌డీవో దత్తారావు, ఎంపీడీవో కోటప్రసాద్ హాజరయ్యారు. గతేడాది ఉపాధిహామీ పథకంలో జరిగిన 420 పనులకు గాను రూ.7.28 కోట్లు ఖర్చు చేశారని, ఇందులో రూ.31,745 రికవరీ చేయగా, రూ.4 వేల జరిమానా విధించారు. ఎస్టీఎం వేణు, విజిలెన్స్ అధికారి ఆంజనేయులు, సాయి శ్రీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అన్నదానం

పెంచికల్‌పేట్: ఎల్కపల్లి రైతువేదిక వద్ద యూరియా కోసం వచ్చిన రైతులకు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మంగళవారం అన్నదానం చేశారు. ఎల్లూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న యూరియా పంపిణీ కేంద్రాన్ని వ్యవసాయశాఖ ఏడీ మనోహర్ తనిఖీ చేశారు. రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఏవో మనీషా ఆధ్వర్యంలో టోకెన్లు పంపిణీ చేశారు. ఎస్సై అనిల్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

కూలిన కల్వర్టు పరిశీలన

ఆసిఫాబాద్‌రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని మానిక్‌గూడ గ్రామానికి వెళ్లేదారిలో కూలిన లోలెవల్ కల్వర్టును బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ పరిశీలించారు. నాయకులు పెంటయ్య, పోచ్చయ్య, సంతోష్, ప్రకాశ్ ఉన్నారు.

అత్యవసర సేవలు వినియోగించుకోవాలి

రెబ్బెన: విద్యార్థులు, మహిళల కోసం పోలీస్ శాఖ ఏర్పాటుచేసిన అత్యవసర సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీఐ ఎం.సంజయ్ కోరారు. మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో పోలీస్ కళాజాత ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు షీటీం, సైబర్ నేరాలు, రోడ్ సేఫ్టీ, విద్య, బాల్యవివాహాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం సీఐతోపాటు ఎస్సై వెంకటకృష్ణను పాఠశాల సిబ్బంది సన్మానించారు. కళాజాత బృందం సభ్యులు శ్రీనివాస్, కానిస్టేబుళ్లు రోహిత్, రాంచందర్, రజిత, సంఘవి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

శాస్త్రసాంకేతిక వైపు అడుగులు వేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు చదువుతోపాటు శాస్త్ర సాంకేతిక వైపు అడుగులు వేయాలని మహిళా సాధికారత జిల్లా సమన్వయకర్త శారద అన్నారు. సైన్స్ టెక్నాలజీ ఇంజనీరింగ్ మ్యాథ్స్ కార్యక్రమంలో భాగంగా జన్కాపూర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులతో సైన్స్ ప్రయోగాలు చేయించారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రయోగాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు తొలగింపు

కాగజ్‌నగర్‌రూరల్: రెబ్బెన మండలంలోని వంకులం గ్రామ సమీపంలోని పెద్దవాగు మూలమలుపు వద్ద ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొని మృతి చెందిన విషయం తెలిసిందే. పెద్దవాగు బ్రిడ్జి మూలమలుపు సమీపం వరకు ఇరువైపులా పిచ్చిమొక్కలను ట్రాక్టర్ ద్వారా తొలగించారు. రెబ్బెన ఎస్సై వెంకటకృష్ణ ఆధ్వర్యంలో వాటిని తొలగింపజేశారు. కాగజ్‌నగర్ మండలంలోని మైసమ్మ ఆలయం నుంచి పెద్దవాగు బ్రిడ్జి వరకు ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వీవోఏల నూతన కార్యవర్గం

బెజ్జూర్: మండల వీవోఏల సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంతోష్, కార్యదర్శిగా విలాస్, పది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

యూరియా కోసం బారులు



రెబ్బెన: మండలంలోని రైతులు యూరియా కోసం అరిగోసపడుతున్నారు. మంగళవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే రెబ్బెన రైతువేదిక వద్ద రైతులు బారులు తీరారు. పాస్‌పుస్తకాలను లైన్లలో పెట్టి వేచిచూశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒకవైపు ఎండకు ఎండుతూ మరోవైపు వానకు తడుస్తూ నిరీక్షించారు. కాగా, ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.సాయికుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899